కలెక్టర్‌ను కలిసిన చూడ చైర్‌పర్సన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా నూతనంగా నియమించబడిన కటారి హేమలత శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్‌పై కలెక్టర్‌తో చర్చించారు.

నలభీమపాకం.. వారిచేతివాటం..

- వంట మాస్టర్లకు పెట్టింది పేరు పుంగనూరు
- అందులో మరింత ప్రత్యేకం ఆరడిగుంట గ్రామం
- తరతరాలుగా ఇదే వృత్తి

ప్రజాశక్తి- పుంగనూరు

పూర్వం పురాణాలలో నలుడు, భీముడు వంటలు అత్యంత రుచికరంగా తయారు చేసే వారని చెబుతుంటారు. అయితే నేడు అదే కోవకు చెందిన వారికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు మండలంకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. అందులోనూ ఆరడిగుంట గ్రామంలో అందరూ అదే వంటలే తమ ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నారు.

మండలంలోని ఆరడిగుంట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోని వారందరికీ ప్రధాన వృత్తి వంట పని చేయడం. వీరందరికీ కూడా ఆరడిగుంట గ్రామంలో వంట మాస్టర్లు గురువులు. ఆరడిగుంట గ్రామంలో సుమారు 250 కుటుంబాలు లింగాయితుల తెగకు చెందిన వారు ఉన్నారు. పూర్వం జమీందారుల ఏలుబడిలో వారికి రుచికరమైన వంటలు వండి వారి నుంచి అనేక ప్రశంసలు పొందేవారు. అప్పటిలో వండాడి రుద్రప్ప, డమాసుల చెంగయ్య, నాగప్ప, ఆవులన్న, మాధవరావు, సదాశివయ్యలంటే వంట చేయడంలో అందవేసిన చెయ్యి అని చెప్పుకునే వారు. వారి నుంచి నేర్చుకున్న వంటలతో ఈ గ్రామంలో ఇంటికి ఒకరిద్దరు చొప్పున నేడు వంటలు చేయడమే వృత్తిగా ఎన్నుకుని రకరకాల రుచికరమైన వంటకాలను తయారు చేయడంలో ఎంతో నైపుణ్యం సాధించారు. శుభకార్యాలయాలైనా, సమావేశాలకైనా భారీ సంఖ్యలో విందు భోజనాలు తయారు చేయాలంటే ఆరడిగుంట వంట వారిని సంప్రదించాల్సిందే. వీరు బృందాలుగా ఏర్పడి కర్నాటకలోని చింతామణి, వసకోట, కోలారు, కెజిఎఫ్, బంగారుపేట, శ్రీనివాసపురం, మాండ్య, బెంగళూరు, తమిళనాడులోని తిరుపత్తూరు, వానంబాడి, ఆంబూరు, క్రిష్ణగిరి, సేలం, ఆంధ్రలోని కదిరి, అనంతపురం, తిరుపతి తదితర ప్రాంతాలలో ఆయా ప్రాంతాల వారి రుచికి అనుగుణంగా వంటలు తయారు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారు. వంద మంది నుంచి ఐదువేల మందికి మూడు పూటలా వంటలు చేసి వడ్డించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. వీరందరు శాఖహార వంట పదార్థాలు వండే వారే. ఐదువేల మందికి వంట చేయాలంటే దాదాపు 100 మంది వంటలో నిమగ్నమైతారు. రవాణా ఖర్చులు, ఇతరత్ర ఖర్చులు పోను వంట ఒప్పందం చేసుకున్న లీడర్‌కు రూ.30 వేల నుంచి 40వేల వరకు మిగులుతుంది. ఇక వంటకు సంబంధించి పాత్రలు, సొంతంగా ఏర్పాటు చేసుకుంటే మరింత ఎక్కువ మొత్తంలో ఆదాయం చేకూరుతుంది. సంవత్సరంలో ఆషాడం, శూన్యమాసం, పిత్రుల అమావస్య సందర్భాలలో మాత్రం వంటపని అంతగా ఉండదని, మిగిలిన నెలలల్లో నిరంతరం బిజిగా ఉంటారు. వీరి వంటలు కావాల్సిన వారు రెండు, మూడు నెలలకు ముందే బుక్ చేసుకున్నా కానీ వీరు అందుబాటులో ఉండటం కష్టసాధ్యమౌతుంది. ప్యూర్ వెజిటేరియన్‌తో పాటు జెట్టిగుండ్లపల్లి గ్రామంలో నాన్ వెజిటేరియన్ ఫుడ్‌కు పెట్టింది పేరు. అలాగే కురపల్లి గ్రామంలో కూడా వెజ్, నాన్‌వెజ్ వంటకాలు తయారు చేయడంలో అందవేసిన చేయి. మీరందరూ ఈ బోయకొండ గంగమ్మ ఆలయంకు కర్ణాటక భక్తులు రావడంతో ప్రతి ఆదివారం వీరికి చేతినిండా పని ఉంటుంది.

ప్రత్యేక వంటకాలు..

అందరు ఎక్కువుగా ఇష్టపడే పూర్ణం బూరేలు, కొబ్బరి పోలీలు, బిసిబెల్లాబాత్, కిచిడి, పొంగల్, దిల్‌పసంద్, కొబ్బరి బర్ఫీ, సుగీలు, గీరైస్, పుదినారైస్, విజిటబల్ పులావ్, గోబీ మంజూరి, పానిపూరి, మసాలపూరి, చోచోబాత్, సెట్‌దోశ, మిరపకాయల బజ్జి, ఉర్లగడ్డ బజ్జి ప్రత్యేకంగా కర్ణాటకలో వివాహాది శుభకార్యాలయాల్లో అత్యంత ప్రీతికరంగా భుజించే పేని, చంచం, చంపాకలి, రసమలై, వాంగిబాత్, సౌండవిజ్, రాయల్, గోడంబీ బర్ఫీ, పాయిసాలలో పితుకుపప్పు పాయిసం, సేమియా, పెసరపప్పు, గోడంబీ పకోడ, ఆనియన్ పకోడ, జీడిపప్పు పకోడ, ఇలా రకరకాల రుచికరమైన వంటలు వండుతూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటున్నారు.

వండి వడ్డించడంలో ఎంతో ఆనందం..

- రవి, ప్రముఖ వంట తయారీదారుడు.

గత 20 సంవత్సరాలుగా ఈ వంట వృత్తిలోనే కొనసాగుతున్నాను. ఒక పూటకు ఐదువేల మందికి కూడా వివిధ రకాల వంటలు తయారు చేసి వడ్డించాం. రాజకీయ నాయకుల సమావేశాలలో కూడా వంటలు తయారు చేసి వారి నుంచి మెప్పను పొందాం. రుచికంగా వంట చేసి వడ్డించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని, దీంతో అప్పటి వరకు పడిన కష్టాన్ని కూడా మరచిపోతాం.

అభిరుచులకు తగ్గట్టు వంట చేస్తాం..

-రెడ్డెప్ప, వంట తయారీదారుడు.

ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా వంటలు ముందుగానే ఆర్డర్లు తెలియజేస్తారు. అలాగే ఎంత మందికి ఎన్ని పూటలు భోజనాలు ఏర్పాటు చేయాలని చెబుతారు. మేము అందుకు అనుగుణంగా ఎంత మంది, ఎలా వంటలు తయారు చేయాలనేది ప్లాన్ చేసుకుని ఆయా ప్రాంతాల వారి అభిరుచికి తగ్గిన విధంగా రుచికరంగా వంట తయారు చేస్తాం

అనుకున్నంత ఆదాయం ఉండదు..

- బాలాజీ, వంట తయారీదారుడు

వంట సామగ్రితో సహా భోజనాలు ఏర్పాటు చేయడం కూడా ఆర్డర్లు తీసుకుంటాం. అలాంటి సమయాల్లో ఒక్కొక్క సారి చేతి ఖర్చులకు కూడా మిగలని పరిస్థితులు ఎదుర్కొన్నాం. లాభనష్టాలను చూడకుండా వంటలు చేసి వడ్డించడమే ముఖ్య ఉద్దేశం. అన్ని సమయాల్లో అనుకున్నంత ఆదాయం ఉండదు.. ఒక్కోసారి మా చేతి నుంచి ఖర్చు అయినా ఆర్డర్ మాత్రం కచ్చితంగా పూర్తి చేస్తాం.

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల ధర్నా

కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో భాగంగా శనివారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. జోరు వానలో కూడా అంగన్వాడీలు ధర్నాను కొనసాగించారు. ధర్నాకు అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీలా మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో 42 రోజులపాటు సమ్మె చేయడం జరిగిందని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సమ్మె సందర్భంగా అంగన్వాడీల శిబిరాల దగ్గరకు వచ్చి తాము అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కారం చేస్తామని, మినీ అంగన్వాడీలను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. బకాయి బిల్లులు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అరాచకం వలన ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిన విషయంలో అంగన్వాడీలు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం బడ్జెట్లో కూడా అంగన్వాడీల ఊసే ఎత్తకపోవడం బాధాకరమన్నారు. పక్క రాష్ట్రంలో లాగా మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చి వారికి పనిభారం తగ్గించాలని కోరారు. మినీలను మెయిన్ వర్కర్‌గా గుర్తించేంతవరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. జిల్లాలోని అధికారులు కూడా వేధింపులు చేస్తున్నారని వాటిని మానుకొని అంగన్వాడీలపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

జోరు వానలోనూ...

భారీ వర్షంలోనూ తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా కొనసాగించారు. భారీ ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్‌కి, ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. పింఛన్ల సందర్భంగా ఎవరైనా అదనంగా డబ్బులు చెల్లించి ఉంటే వివరాలు ఇస్తే వాటిని తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ నాయకులు ప్రమీల, సరళ, అనిత, శోభ ఎర్రమ్మ, లీలావతి, మమత, విజయ, అనిత, ధనకోటి, షీలా, శ్యామలమ్మ పాల్గొన్నారు.

పకడ్బందీగా 'రాష్ట్రీయ బాల స్వస్థ'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డిఎం అండ్ హెచ్ఓ, డీఈఓ, ఐసిడిఎస్ పీడీని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌లో భాగంగా రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమాన్ని డీఈఓ, ఐసిడిఎస్ పీడీల సమన్వయంతో డిఎం అండ్ హెచ్ఓ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఎంఈఓలు, సిడిపిఓలు, మెడికల్ అధికారుల ద్వారా 0–6, 7–18 సంవత్సరాల మధ్య పిల్లలకు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌లో భాగంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న పిల్లలకు వైద్యసేవల కోసం డిఎం అండ్ హెచ్ఓకు సిఫారసు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 2,420 అంగన్వాడీ సెంటర్లలో 54,293 పిల్లలకు 2,470 స్కూల్స్‌లో1,48,483 విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ఉద్యోగం పోయే..! జీతం రాదాయే..?

- గత ప్రభుత్వ పాపం.. ఉద్యోగులకు శాపం..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

మద్యం అమ్మకాల్లో అప్పటి వరకు ఉన్న టెండర్ల విధాన్ని రద్దు చేసి ప్రభుత్వమే మద్యం విక్రయిస్తుంది.. క్రమక్రమంగా మద్యం ధరలు పెంచుతాం.. అమ్మకాలు తగ్గిస్తాం.. ఈ ఐదేళ్ళలో సంపూర్ణ మద్యనిషేధం చేస్తాం... ఇది గత వైసిపి ప్రభుత్వంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ. మద్యనిషేధం అటుంచితే... మద్యం రేట్లు పెరగడంతో కర్ణాటక మద్యం జిల్లాలో ఏరులైపారింది. నాటి చోటా నాయకులు దీన్ని సొమ్ము చేసుకొని కోట్లు గడించారడానికి పోలీసులకు పట్టుబడ్డ అక్రమ మద్యం సీసాలే సాక్ష్యం.. నాటి చోటా మోటా నాయకులపై అక్రమ కేసులే నిదర్శనం..

ఇదిలా ఉండగా ఉన్నత చదువులు చదువుకున్నా ఉద్యోగం లేని నిరుద్యోగులు కుటుంబాల పోషణ కోసం ఏపనైతేనేమి అని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో ఉద్యోగం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. గత ప్రభుత్వం 2019 సెప్టెంబర్ 20 నుంచి 31వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సెల్‌మెన్స్, వాచ్‌మెన్‌లకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. సూపర్ వైజర్‌కు రూ.21వేలు, సెల్‌మెన్స్‌కు రూ.18వేలు, వాచ్‌మెన్స్‌కు రూ.12వేలుగా నెలసరి జీతం నిర్ణయించింది. ఏడాది కోసారి బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేసేలా థార్డ్‌ఐ, రెడ్డి ఎంటర్‌ప్రైజస్ ఏజెన్సీలకు అప్పగించింది. మద్యం షాపుల సిబ్బంది, నిర్వహణ అంతా వీరిదే బాధ్యత. మనిషి మనిషి తాకేందుకు భయపడుతన్న కరోనా కాలంలోనూ మద్యం దుకాణం సిబ్బంది రోజుకు 12 గంటలకు పైగా పనిచేశారు. కరోనా కాలంలో కొందరు కరోనా భారినపడి మృతి చెందారు. వీరికి ఏజేన్సీ నిర్వాహకులు ఎలాంటి పరిహారం ఇవ్వకపోగా బోనస్ సైతం ఎగ్గొటారు. ఇలా గత ప్రభుత్వం మద్యం దుకాణాల సిబ్బందికి తొమ్మిది నెల జీతం, రవాణా ఖర్చులు, కరెంట్ బిల్లులు వీరి నుంచే కట్టించి ఇలా ప్రభుత్వ మద్యం దుకాణాల పనిచేసి ఒక్కొ సూపర్‌వైజర్, సెల్‌మెన్‌కు లక్ష రూపాయలకు పైగా గత ప్రభుత్వం బకాయి పడింది.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది (ఫైల్ ఫొటో)

అక్టోబర్ నెల జీతం పెండింగ్

ప్రభుత్వం మారింది.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. అధికారంలోకి రాక ముందు ప్రత్యామ్నాయం చూపుతామని బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది.. తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఎలాంటి ద్రోహం చేయమని నమ్మబలికింది. తమ సమస్యలపై ఈ ఏడాది వినాయక చవితి పండగ రోజు సమ్మె సిద్ధమైన మద్యం దుకాణాల సిబ్బందికి విజయవాడలో సంభవించిన వరద కారణంగా సమ్మెను విరమించుకోవాలంటూ ప్రభుత్వం సమ్మెను విరమింపజేసింది. నమ్మించి గొంతు కోసినట్లు మద్యం దుకాణాల టెండర్లు పిలిచి ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలు కట్టబెట్టి మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది 11 వందల మందిని నిరుద్యోగులగా మార్చేంది. అక్టోబర్ నెల జీతం సైతం ఇవ్వకపోవడంతో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం తమ జీవితాలతో అడుకుంటుంది అంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పెండింగ్ జీతం, రవాణా భత్యం, ఇతర ఖర్చులు చెల్లించాలని కోరుతున్నారు.

విద్యతోనే కులవివక్షకు విముక్తి

ఆర్‌డిఓ భవాని శంకర్

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఉన్నత విద్యతోనే కులవివక్ష విముక్తి లభిస్తోందని నగరి ఆర్డీవో భవాని శంకర్ అన్నారు. శనివారం స్థానిక శ్రీలక్ష్మీనరసింహ జూనియర్ కళాశాల ఆవరణంలోవిద్యార్థులకు కులవివక్ష, సైబర్ నేరాలపై ఒక్కరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించినప్పుడే అంటరానితనాన్ని పూర్తిగా రూపుమాప వచ్చన్నారు. విద్యార్థి దశ నుంచి భారత రాజ్యాంగంపై, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి వాటిపై జరిగే అరాచకాలను రూపుమాలని, అదేవిధంగా డాక్టర్ అంబేద్కర్, అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని వారి అడుగు జాడల్లో నడుచుకోవాలన్నారు. చిత్తూరు డీఎస్పీ పద్మాలత, సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ (తిరుపతి) మాట్లాడుతూ విద్యార్థుల ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదిగి సమాజంలో గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, సెల్ఫోన్ మెసెజీలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు అధికమవుతుందని వీలైనంత వరకు సెల్‌పోన్ వాడకానికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ఎస్‌సిడిపిఓ సాయినాథ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సమాజంలో రాణించిడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఈడీ రాజ్యలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఎస్.మూర్తి, సిఐ హనుమంతప్ప, తహసీల్దార్ నాగరాజు. ఎంపీడీవో చంద్రమౌళి, ఎస్ఐ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, డీటీ స్వరూపా రాణి, వీఆర్వో తేజ పాల్గొన్నారు.

జిల్లా అధికారులకు జ్ఞాపికను అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ దిలీప్

పశువైద్యశాలలో జేడీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని ఎస్ఎస్ కొండ, ఎట్టేరి పశు వైద్యశాల, పి.బి.అగ్రహారంలో కొత్తగా నిర్మించిన గోకులం షెడ్‌ను శనివారం జిల్లా పశువైద్య శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 జాతీయ పశు గణన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర నెల్లూరు ఏడి డాక్టర్ మురళీమోహన్, ఎట్టేరి పశు వైద్య అధికారి నాగాంజనేయులు, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో పేదలకు మొండిచేయి..

ప్రజాదృష్టి

- ఉద్యమ బాటలో స్కీమ్ వర్కర్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బడ్జెట్ కేటాయింపులో పేద, మధ్యతరగతికి ఊరటనిచ్చేలా లేకపోవడంతో 2024–25 రాష్ట్ర బడ్జెట్‌పై స్కీమ్ వర్కర్లు, పేద మధ్యతగతి కుటుంబాలతో పాటు కార్మికుల బడ్జెట్ కేటాయింపులపై వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన కుటమి ప్రభుత్వం సూఫర్ సిక్స్ పథకాలకు ఆ మేరకు కేటాయించకపోవడం, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధికి నిధులు కేటాయింపులు తగ్గించడంతో పాటు విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని ప్రకటించిన చంద్రబాబు సర్కార్ విద్యారంగానికి గత ప్రభుత్వం కంటే బడ్జెట్ తగ్గించడం పట్ల ఉపాధ్యాయ లోకం భగ్గుమంటోంది.

ఇక స్కీమ్ వర్కర్ల విషయానికి వస్తే అంగన్వాడీ, ఆశ, మిడేమీల్స్ ఇలా అనేక రంగాల్లో స్కీమ్ వర్కర్లు పని చేస్తున్నారు. వీరి జీతాలపెంపుపై ఎలాంటా హామీ లేదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్ విషయం ప్రస్తావనే లేకపోవడం రాష్ట్ర బడ్జెట్ వీరిని నిరాశపరిచందని చెప్పక తప్పదు. అడవిపల్లి రిజ్వయర్ నుంచి ఎన్‌టిఆర్ జలాశయానికి నీటి కేటాయింపు, జిల్లా కేంద్రంలో యూనివర్శిటీ ఏర్పాటు చిత్తూరు నగరవాసులకు ఊరటనిచ్చేలా ఉంది. ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం, బీజేపి, జనసేన కూటమిగా పోటీ చేసి ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలు నెరవేరాలేవంటూ ప్రజలకు రాష్ట్ర బడ్జెట్‌పై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

పోరాటాలకు సిద్ధం

కుటమి ప్రభుత్వానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పోరాటాలకు సిద్ధమవుతున్నారు. అంగన్వాడీల జీతాల పెంచుతాము, సమస్యల పరిష్కరిస్తామంటూ అంగన్వాడీల సమ్మె సందర్భంగా తెలుగుదేశం, జనసేన నేతలు అంగన్‌వాడీలో ఆందోళన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని హామీలిచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి 130 రోజులకు పైగా అవుతున్నా పట్టించుకోకపోవడంతో ఉద్యమాలకు సిద్ధం అవుతున్నారు. అలాగే ఆశాలు, మిడేమీల్స్ వర్కర్లు ఇదే కోవలో ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. కాంట్రాక్టు, ఔవుట్ సోర్సింగ్ వర్కర్లదీ ఇదే పరిస్థితి. 108 సిబ్బంది ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై ప్రజాసంఘాల నేతృత్వంలో ఈనెల 26వ తేదీ కలెక్టరేట్ ధర్నాకు పిలుపునిచ్చింది. ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు ప్రజాపోరు పేరిట సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఊరు– వాడ తిరిగి గుర్తించిన సమస్యలపై తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇలా అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధం అవుతున్నారు.

చంద్రబాబు ఇంట విషాదం

అన్నదమ్ముల అనుబంధం (ఫైల్)

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

ఎపి సిఎం చంద్రబాబునాయుడు ఇంట్లో విషాదం నెలకొంది. తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు (72) హైదరాబాద్ గచ్చిబౌలి ఎఐజి ఆస్పత్రిలో అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం మృతిచెందారు. ఆయన పార్థివదేహాన్ని ఆదివారం ఉదయం తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లికి తీసుకురానున్నారు. సాయంత్రం అంత్యక్రియలు జరగనున్నాయి. నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ కుటుంబ సభ్యులు, నందమూరి బాలక్రిష్ణ కుటుంబ సభ్యులు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, దగ్గుపాటి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అందరూ నారావారిపల్లికి ఆదివారం రానున్నారు. నారావారిపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. నారా రామ్మూర్తి కుమారుడు ప్రముఖ హీరో నారా రోహిత్.

పలువురి సంతాపం

చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు సొదరుడు నారా రామూర్తి నాయుడు మృతిపై చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, చిత్తూరు ఎంఎల్‌ఎ గురజాల జగన్‌మోహన్, మాజీ ఎంఎల్‌సి దొరబాబు, చూడ చైర్‌పర్సన్ కఠారి హేమలత, పలువురు నాయకులు శనివారం సంతాపం తెలపడంతోపాటు నారా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నారా రామూర్తి చంద్రగిరి ఎంఎల్‌ఏగా ఉన్న సమయంలో కాణిపాకం ఆలయ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.

వెదురుకుప్పం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ చంద్రగిరి ఎమ్మెల్యే, నారా రామమూర్తి నాయుడు మరణించడంతో ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వెదురుకుప్పం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసినట్లు టిడిపి క్లస్టర్ ఇన్చార్జి పి.మోహన్ మురళి తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ హనుమంత రెడ్డి, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు గంగయ్య, నియోజకవర్గ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, యూనిట్ ఇంచార్జ్ శ్రీరాములు రెడ్డి, మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మహేష్ ఉన్నారు.

పాలెం చెరువు కట్టకు గండి

గ్రామస్తుల సాయంతో పూడ్చివేత

ఇబ్బందిపడిన ప్రజలు, వాహనదారులు

ప్రజాశక్తి- సదుం

మండల పరిధిలోని తాటిగుంటపాలెం గ్రామానికి వెళ్లే ప్రదాన రోడ్డు మార్గానికి ఆనుకుని వున్న పాలెం చెరువు కట్టకు శనివారం గండిపడింది. తుపాను నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు గార్గేయ నది నుంచి కాలువ ద్వారా వరద నీరు చెరువుకు చేరుతోంది. ఈ చెరువు ఎప్పుడూ నీటితో నిండి రైతుల పంట సాగుకు అనుకూలంగా ఉంటుంది. చెరువు నిండిన తరువాత పీలేరులోని అగ్రహారం చెరువుకు మొరవ ద్వారా నీరుపారుతుంది. కాగా శనివారం నీరు పెద్దమొత్తంలో చెరువుకు చేరడంతో ఓ పక్క గండిపడింది. చెరువు కట్టపై తాటిగుంటపాలెంకు గ్రామస్తులు వెళ్తుంటారు. గమనించిన గ్రామస్తులు వెంటనే గండి పూడ్చి వేశారు. అయితే కొంత సమయం కట్టపై వెళ్లాల్సిన వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న సదుం ఈఓపిఆర్‌డి వరప్రసాద్, ఇరిగేషన్ డీఈ ప్రసాదను, ఏఈ భరత్‌ను అప్రమత్తం చేశారు. అనంతరం తహశీల్దార్ మరూఫ్ హుస్సేన్, ఏఈ, విఆర్‌ఓఎస్ మహబూబ్ బాషా చెరువు కట్టను పరిశీలించారు. ఎర్రగుంటపల్లికి చెందిన రైతు మునిరెడ్డి ట్రాక్టర్‌తో మట్టిని తోలగా, టిడిపి నాయకులు మహేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి గ్రామస్తుల సాయంతో గండిని పూడ్చారు. మళ్లీ గండిపడకుండా తహశీల్దార్ ఇసుక బస్తాలను సిద్ధం చేయించారు.

చెరువు కట్టపై ఇబ్బంది పడుతున్న వాహనదారులు

చెరువు కట్టకు పడిన గండిని పూడ్చుతున్న గ్రామస్తులు

శాశ్వత సభ్యత్వం తీసుకున్న డాక్టర్ సుధీర్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ సుధీర్ తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకోవడం జరిగింది. వృత్తిరీత్యా వైద్యులు అయిన ఆయన గత పురపాలక సంఘం ఎన్నికలలో వైసిపి తరపున 16వ వార్డు అభ్యర్థిగా గెలుపొంది, పురపాలక సంఘం అధ్యక్షులుగా నియమితులైన సంగతి తెలిసిందే. అనంతరం చోటు చేసుకున్న రాజకీయ సమీకరణల కారణంగా ఆయన వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి, తన పదవులకు రాజీనామా చేసి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం పార్టీ అధినేత పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సభ్యత్వ నమోదులో భాగంగా ఆయన శనివారం శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు రాష్ట్రం, ఇటు కుప్పం నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనించాలంటే అది కేవలం చంద్రబాబు నాయకత్వంతోనే సాధ్యమని నమ్మి తాను పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఆ నమ్మకంతో, కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి బాబు నాయకత్వంలో చివరి వరకు పనిచేయాలన్న సంకల్పంతో టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్టు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: సాయి మాతాసేవా ట్రస్ట్ తరపున ఆదివారం కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్ బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ తరపున ప్రతినెలా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం చిత్తూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలోని శంకర కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని కుప్పం పరిసర ప్రాంతాలలో కంటికి సమస్యలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం మండల పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బందికి అవసరమైన ఉపకరణాలను కడా పిడి వికాస్ మరమత్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మండల పరిధిలోని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలకు అవసరమైన బిపి ఉపకరణాలు, గ్లూకోమీటర్‌లను వైద్యాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ వెంకటేష్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ పాల్ శ్రీనివాస్, మండల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సందర్భంగా ఉచిత శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని బిసి సంక్షేమశాఖ అధికారి ఎస్‌కె. రబ్బాని, శనివారం జ్యోతిరావు పూలే బీసీ భవనంలో జ్యోతి ప్రజ్వలన చేసి లాంచనంగా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమశాఖ విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. బడుగు, బలహీన, వర్గాలు పేద విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన ఈ ఉచిత శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ఉచిత శిక్షణ కార్యక్రమం 60 రోజులపాటు జరుగుతుందని తెలిపారు. 220 మంది అభ్యర్థులకు శిక్షణతో పాటు పుస్తకాలు స్టయిఫండ్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారులు మునీంద్రయ్య, వాసంతి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు, వీవోలు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకొని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనాలు కలిగి పరిరక్షించబడే విధంగా ప్రణాళిక తయారు చేయడమే గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అని తెలిపారు. ప్రణాళికలో భాగంగా బాలల సభ, మహిళల సభలు, నిర్వహించి అందులో సమస్యలను గుర్తించి పంచాయతీ పాలకవర్గ సభ్యులు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, సాంకేతిక నిపుణులు, కలిసి ప్రజలందరి భాగస్వామ్యంతో ప్రణాళిక తయారు చేసి మొదటి గ్రామసభలో సంకల్పం తీసుకొని, రెండవ గ్రామసభలో జిపిడిపి ప్రణాళిక ఆమోదంతో గ్రామస్వరాజ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయడంతో ప్రక్రియ ముగిస్తుందని తెలిపారు. ఎంపీపీ వసుంధర కోదండ రెడ్డి, జడ్పిటిసి శ్రీనివాసులు, కో ఆప్షన్ నిసార్, ఎంపిటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధికి కృషి చేస్తా...

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పురపాలక సంఘం అధ్యక్షునిగా అవకాశం కల్పిస్తే పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని 19వ వార్డు కౌన్సిలర్, పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ దామోదర్ నాయుడు (జిమ్ దాము) తెలిపారు. గతంలో జరిగిన పురపాలక సంఘం ఎన్నికలలో కుప్పం పట్టణ పరిధిలో వైసిపి అభ్యర్థి గెలుపొంది అధ్యక్ష పదవిని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. అనంతరం అప్పటి పురపాలక సంఘం అధ్యక్షులు తన అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, టిడిపిలో చేరడంతో సూపర్ పురపాలక సంఘం అధ్యక్ష కుర్చీకి స్థానికంగా పోటీ పెరిగింది. అధ్యక్ష పదవి ఖాళీ కావడంతో స్థానికంగా తెలుగు తమ్ముళ్లు తమకే అవకాశం కల్పించాలని కోరుతూ, పార్టీ అధిష్టానం మెప్పు పొందడానికి తెరువనుక ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ గా కొనసాగుతున్న 19వ వార్డు అభ్యర్థి ముందు వరసలో ఉన్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి, పురపాలక సంఘం అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని కోరినట్టు జిమ్ దాము తెలిపారు. పార్టీ అధినేత అవకాశం కల్పిస్తే పురపాలక సంఘం అధ్యక్షుడిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, పట్టణాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

జర్నలిస్టు సమస్యలు పరిష్కరించాలని వినతి

పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి గీటు రాయి: ఏపీడబ్ల్యూజేఎఫ్

చిత్తూరులో అన్నదానం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాస్వామ్య పరిరక్షణలో నాలుగవ మూల స్తంభం పత్రికలేనని ఏపీడబ్ల్యూజెఎఫ్ జిల్లా కన్వీనర్ వరదరాజులు అన్నారు. శనివారం చిత్తూరు నగరంలోని గంగనపల్లిలోని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏపీడబ్ల్యూజెఎఫ్ నాయకులు జయరాజ్, కేశవులు, జయచంద్ర, ప్రకాష్, దినేష్, రెడ్డి, బాలు, కుబేర, నాగరాజు, మురళి, తులసి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య రాజ్యంలో అన్యాయాలు అక్రమాలను ప్రశ్నించాలన్నా, ప్రజల పక్షాన నిలబడే ఏకైక వజ్రాయుధం పత్రికలే అన్నారు. నవసమాజ నిర్మాణానికి నాలుగవ మూల స్తంభం పత్రికలని, ప్రభుత్వం పత్రికా విలేకరులకు సముచిత స్థానం గౌరవం కల్పించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం నిరాశ్రయుల వసతి గృహంలో నిరాశ్రయులకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వెదురుకుప్పం: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా వెదురుకుప్పం మండలం పచ్చికాపలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల వర్కింగ్ జర్నలిస్టులు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా ఏపీయూడబ్ల్యూజే వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపుమేరకు జర్నలిస్టు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెదురుకుప్పం మండల పరిషత్ సూపరింటెండెంట్ నాగమణి, ఎస్సై వెంకటసుబ్బయ్యకు జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులు పన్నూరు రవి, పుల్లూరు రఘునాథ రెడ్డి, విజయ కుమార్, వరదారెడ్డి, దేవరాజులు, రాజా, వినోద్, ప్రశాంత్,జ యచంద్రా రెడ్డి, మహేంద్ర పాల్గొన్నారు.


వెదురుకుప్పంలో పండ్లు పంపిణీ

పలమనేరు: శనివారం జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పలమనేరు ఆర్‌డిఓ భవానికి జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించడం జరిగినది. అనంతరం పలమనేరు ఏరియా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్స్ పండ్లు పంపిణీ చేయడం జరిగింది.

పుంగనూరు: జర్నలిస్టు సమస్యలను పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి జి.వాలీశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకొని పుంగనూరులో డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వరరావుకు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వాలీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జీతభత్యాలు లేకుండా ఎన్నో ఏళ్లుగా సమాజమే ముఖ్యంగా భావించి ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని అన్నారు. ఎప్పటికప్పుడు వార్తల సమాచారం అధికారులకు తెలియజేస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కానీ జర్నలిస్టుల సమస్యలు మాత్రం ఏ ఒక్క ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఉండడానికి కనీసం ఇల్లు కూడా లేకపోవడం చాలా బాధాకరమన్నారు. కొంతమంది రాజకీయ నేతలు జర్నలిస్టులపై వ్యక్తిగత దాడులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని, దీనివలన ఎంతోమంది జర్నలిస్టులు చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కుటమి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి పక్క ఇల్లు రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా జర్నలిస్టుల పరిరక్షణ కొరకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి జర్నలిస్టుకి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. జర్నలిస్టులు గిరిశేఖర్, మురళి, భాను ప్రకాష్, లోకేష్ కుమార్, రెడ్డప్ప, కార్తీక్, పురుషోత్తం పాల్గొన్నారు.


పుంగనూరులో వినతి


పలమనేరులో వినతి

హెచ్ఎంకు అబ్దుల్ కలాం అవార్డు

హెచ్ఎం గంగాధరంను సన్మానిస్తున్న శివరాజు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు పంచాయతీ అక్కనగారిపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధరం అబ్దుల్ కలాం అవార్డు అందుకున్నారు. వివిధ స్కూల్లో పనిచేసిన గంగాధరం అక్కడ చదివే విద్యార్థులకు తనవంతు సహాయంగా బట్టలు, నోట్‌బుక్స్, పెన్సిల్స్, పెన్నులు, పలకలు అందజేశారు. ఆయన విద్యార్థులకు అందించిన సేవలను గుర్తించిన సోమల రాజు ఫౌండేషన్ అధ్యక్షుడు శివరాజు అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పిసిఆర్ గ్రౌండ్‌లో అవార్డును అందజేయడంతోపాటు శాలువా కప్పి మెమెంటోతో సత్కరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- బంగారుపాల్యం

మండల సర్వసభ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. మండలంలోని ఎమ్మెల్యే ,ఎంపీపీ, జడ్పిటిసి ,ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు మండల సమావేశానికి హాజరుకావాలని గతంలో ఇచ్చిన నివేదికలను సిద్ధంగా ఉంచుకొని వారి అజెండా వచ్చినప్పుడు ప్రజా ప్రతినిధులకు అందజేసి నివేదికలను మండల సర్వసభ సమావేశంలో తెలపాలన్నారు

'ఉద్యమకారులతో గ్రంథాలయాలు'

ప్రజాశక్తి- పూతలపట్టు: పలువురి ఉద్యమకారుల చొరవతోనే గ్రంథాలయ భాండాగారాలు వెలసాయని పూతలపట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ తెలిపారు. 75వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా శనివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా గ్రామాల్లో గ్రంథాలయాలు ప్రారంభించడం ద్వారా విజ్ఞానాన్ని అందరికీ పంచిపెట్టడం చైతన్యం తీసుకురావడం జరిగిందన్నారు.

పలమనేరు: స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయాలకు ఊపిరి పోసిన ఉద్యమకారులను శనివారం గుర్తుచేసుకున్నట్లు గ్రంథాల అధికారి హేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అప్పట్లో గ్రంథాలయాలు కొంతమంది సంపన్నవర్గాలు, జమీందారులకు మాత్రమే అందుబాటులో ఉండేవని, గ్రంథాలయ ఉద్యమకారులైన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్సార్ రంగనాథన్ వంటివారి కృషి ఫలితంగా నేడు సామాన్యులకు సైతం ఉచితంగా ప్రభుత్వ గ్రంథాలయాలలో చదువుకోవడానికి వీలుకలిగిందన్నారు.

దొరస్వామిరెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామానికి చెందిన ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి తండ్రి దొరస్వామిరెడ్డి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొంది శనివారం ఇంటికి చేరుకున్నారు. దీంతో ఆయన్ను మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పుష్ప మునికృష్ణ, గాంధీ పాల్గొన్నారు.

షికారి పాలెంకు నీటి ఎద్దడి

పాలిటెక్నిక్ కళాశాల వారు కాలనీ నీటిని కాజేస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి- గంగవరం

గంగవరం పంచాయతీ నల్లగుట్లపల్లి సమీపానగల షికారి కాలనీలో ఉన్న తాగునీటి బోరు నీటిని సమీపాన ఉన్న పాలిటెక్నిక్ కాలేజీ వారు పైప్‌లైన్ వేసుకొని తమ కాలనీకి నీరు రాకుండా అడ్డగిస్తున్నారని షికారీ కాలనీ వాసులు ఆరోపించారు. వారు మాట్లాడుతూ గతంలో తమ కాలనీకి తాగునీరు లేకపోవడంతో చుట్టుపక్కల ఐదు బోర్లు వేసినా ప్రయోజనం లేక నీటి కోసం పొలాల వద్ద వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వచ్చేదని అయితే గత సంవత్సరం కాలనీకి సమీపాన ఉన్న ప్రభుత్వ భూమిలో బోరు వేయగా నీరు పడటంతో సంతోషపడ్డామని ఆ నీటితో కాలనీ నీటికష్టాల నుంచి భయపడ్డామని తెలిపారు. కాగా ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాల వారు బోరు నుంచి పైపులైను ద్వారా నీటిని తీసుకోవడమే కాకుండా కాలనీకి నీళ్లు రాకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు వారిని అడిగినా పట్టించుకోవడం లేదని నీరు లేక వారిని ఒక్కసారి కూడా స్నానం చేయలేకపోతున్నామని, కనీసం తాగడానికి, వంట చేసుకోవడానికి కూడా నీరు వదలడం లేదని వాపోయారు. ప్రభుత్వ కళాశాలకు తాగునీటి సమస్య ఉంటే అధికారులు పరిష్కరించాలేకానీ ఇలా కాలనీ బోరు నుంచి నీటిని తీసుకుని మమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

విజయం బిజినెస్ స్కూల్ ఫ్రెషర్స్ డే సంబరాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక సుందర రాజపురంలోని విజయం బిజినెస్ స్కూల్ ఫెషర్స్‌డే సంబరాలు ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ వృత్తిపరమైన కోర్సులో పోటీ విధానాన్ని పెంపొందిడం కోసం తాము వృతిపరమైన విద్యాకోర్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్, సీనియర్లకు నిర్వహించే ఫ్రెషర్స్‌డే వీరి మధ్య స్నేహ బంధాన్ని పెంచుతుందన్నారు. విజయం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ శైలజమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న వనరులను, అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోని సమాజంలో ఇతరుకులు ఉపాధి కల్పించేస్థాయికి ఎదగాలని సూచించారు. విజయం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నం నాయుడు, బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ జయంత్‌విద్యార్థులు స్నేహపూరిత వాతావరణంలో విద్యానభ్యసించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ తేజోమూర్తి

కులాన్ని గుర్తించి ధ్రువపత్రాన్ని అందించండి

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పిరమలై కులాన్ని గుర్తించి ప్రభుత్వం కులధ్రువీకరణ పత్రాలను జారీ చేయడానికి చర్యలు చేపట్టాలని కుప్పం నియోజకవర్గ దేవర్ సేవా సంఘం అధ్యక్షులు శివ తేవర్ కోరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పిరమలై కుల ధ్రువీకరణ పత్రాలను పొందడానికి కులసభ్యులు ఎంతోకాలంగా పోరాడుతున్నామని తెలిపారు. తమ పోరాటాన్ని గుర్తించిన ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము అధికారం చేపట్టిన అనంతరం పిరమలై కులాన్ని గుర్తించి, వారికి కులధ్రువీకరణ పత్రాలను అందించడం జరుగుతుందని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం తమ కులసభ్యులకు ధృవీకరణ పత్రాలు అందించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఇందులో భాగంగా తమ కుల సంఘం నాయకులు రాష్ట్ర సచివాలయంలో బీసీ శాఖ మంత్రి సవిత, భూగర్భ గనులశాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌లను కలిసి వినతి పత్రాలను అందజేసి, తమ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ తేవర్, ఎంబీసీ స్టేట్ ప్రెసిడెంట్ పూసలరవి, రాష్ట్ర కార్యదర్శి రాజా తేవర్, రాష్ట్ర ఉప కార్యదర్శి వెంకటేశ్ తేవర్, చల్లా కుమార్ తేవర్ ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పిరమలై కుల సంఘం నాయకులు

విద్యార్థులకు విధిగా వైద్యపరీక్షలు చేయాలి

యాదమరిలో..

ప్రజాశక్తి- యాదమరి: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు విధిగా వైద్యపరీక్షలు చేయాలని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యాదమరి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు వైద్యసిబ్బంది వివిధ రకాల పరీక్షలను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వేద విద్యార్థుల ఆరోగ్యం పై దృష్టి పెట్టిందని, 40 రకాల పరీక్షలు నిర్వహించి పిల్లల్లో ఏదైనా లోపాలు ఉంటే వారికి కేటాయించిన హెల్త్ కార్డుల్లో నమోదు చేసి ఇక్కడ నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని, పెద్దఆసుపత్రులకు తీసుకువెళ్లే సదుపాయాన్ని సైతం ప్రభుత్వం కల్పించిందన్నారు. హెల్త్ సూపర్వైజర్ సెల్వరాని, లక్ష్మీపతి, రేఖ, ఆశ, వినాయక, పద్మ పాల్గొన్నారు.

సదుం: రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా శనివారం చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరీష ఆధ్వర్యంలో డాక్టర్ చరణ్ ఎస్ఎంపల్లి అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చరణ్ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండీ డిసెంబర్ 30 తేదీ లోపు మండల పరిధిలోని అంగన్వాడీ సెంటర్లు, ఎంపిపీ ప్రాథమిక పాఠశాలలు, ఎంపీ యూపీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నీలకంఠ, జానకి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రావణి, మనోహర్, అంగన్వాడీలు రెడ్డమ్మ, జయశ్రీ పాల్గొన్నారు.


సదుంలో..

సోమల: వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించి వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఇరికిపెంట పంచాయతీ మేటి మంద గ్రామంలో 104 వాహనం ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబంలోని సభ్యులకు బిపి, షుగర్ ఇతర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు హైట్, వెయిట్, రక్తపరీక్షలను నిర్వహించి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. సిహెచ్ఓ అమర్నాథ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లతా, గుణవతి నాగరత్న శ్రీలక్ష్మి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమలలో..

క్రైం న్యూస్

ఇసుక ట్రాక్టర్ కింద పడి

చిన్నారి దుర్మరణం

ఇసుక ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన చిన్నారి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పొద్దున్నే చక్కగా స్నానం చేసి యూనిఫాం వేసుకొని తల్లి వెంట స్కూల్‌కు బయలుదేరిన ఏడేళ్ళ చిన్నారిని ఇసుక ట్రాక్టర్ రూపంలో మృతువు కబలించింది. చిత్తూరు దుర్గానగర్ కాలనీ గాండ్లవీధికి చెందిన కిరణ్, స్వప్న దంపతుల రెండో కుమారుడు జైనిరూప్ (7) స్థానిక బివిరెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో రెండో తరగతి చదువుతున్నాడు. ఇంటి నుంచి రెండున్న కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు ఏడేళ్ళ కుమారుడ్ని బైక్‌పై వెంటబెట్టుకొని రోజూలానే దుర్గానగర్ కాలనీ నుండీ మెసానికల్ క్రీడా మైదానం వరకు వచ్చారు. రోడ్డు మలుపు వద్ద వెనుక కూర్చొన్న జైనిరూప్ రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన ఇసుక ట్రాక్టర్ చక్రం చిన్నారి ఎక్కడంతో తల నుజ్జునుజ్జయింది. దీంతో చిన్నారి అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యాడు. కళ్ళముందే కుమారుడు అత్యంత దారుణంగా మృతి చెందడంతో తల్లి స్వప్న గుండే పగిలేలా రోదనలు అక్కడి వారు కంటతడి పెట్టించాయి. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందాడని అతివేగంగా ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ కన్నుమిన్ను కానకుండా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందంటూ స్థానికులు ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వన్‌టౌన్ పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు డ్రైవర్‌ను ఆదుపులోకి తీసుకొని కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి- కార్వేటినగరం: జిల్లా ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్ అధికారుల ఆదేశాల మేరకు కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శనివారం మెరుపు దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, టాస్క్ ఫోర్సు సీఐ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలసముద్రం మండలం నరసింహాపురం గ్రామంలో దాడులు నిర్వహించి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే వెదురుకుప్పం మండలంలోని యనమలమంద గ్రామ సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన 800 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసి, శ్రీరంగరాజపురం మండలం మర్రిపల్లె గ్రామ సరిహద్దులో అక్రమంగా దాచి ఉంచిన 400 లీటర్ల బెలం ఊటను ధ్వంసం చేశామన్నారు. అనంతరం టాస్కోఫోర్సు సిఐ అశోక్ మాట్లాడుతూ గ్రామాల్లో సారా అమ్మకాలు, తయారీలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ఎక్సైజ్ ఎన్ఫోర్సుమెంట్ అధికారులకు సమాచారం అందించాలని, సహకరించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సిబ్బంది సుందరం, రాజీవ్, గీత, పళణి, గుర్రప్ప, రామన్, హరిప్రసాద్, చంద్రమోహన్, పుల్లీబాయి, విజయ పాల్గొన్నారు.

వాహనం దగ్ధం

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మండల పరిధిలోని బెంగళూరు చెన్నై జాతీయ రహదారి జగమర్ల సమీపంలో శనివారం ఉదయం స్కార్పియో వాహనం అగ్నికి ఆహుతైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వాహన డ్రైవర్ రమేష్ స్కార్పియో వాహనంలో శుక్రవారం తమిళనాడు తిరువన్నామలై దైవదర్శనం చేసుకోవడానికి వెళ్లి స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణం చేస్తుండగా పలమనేరు సమీపంలో వాహనం ముందు భాగాన మంటలు రావడంతో పక్కగా ఆపి అందరూ కిందకు దిగారని, ఇంతలోనే భారీ ఎత్తున మంటలు వ్యాపించి స్కార్పియో వాహనం పూర్తిగా దగ్ధమైందన్నారు. వెంటనే అగ్ని మాపక శాఖ వారికి సమాచారం అందించినా వారు వచ్చే సమయానికే వాహనం పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. ఆ దేవున్ని దయవల్లే తాము ప్రాణాలతో బయటపడ్డామని వాహనంలోని మహిళలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.